AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in



**మంట పుట్టిస్తున్న గ్యాస్ ధరలు** 2







**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి** 2


## పోతంగల్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా రంజిత్



**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా రంజిత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పోతంగల్‌కు ఇన్‌ఛార్జీగా కోటగిరి తహశీల్దార్ గంగాధర్ పనిచేస్తుండగా.. సోమవారం ఆయన రంజిత్‌కు బాధ్యతలు అప్పగించారు. రంజిత్ నవీపేట్ మండలం నాయబ్ తహశీల్దార్‌గా పనిచేస్తూ పోతంగల్‌కు ఇన్‌ఛార్జీగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా రంజిత్‌కు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ హజీజ్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.





## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిబంధనలకు అనుగుణంగా ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిపించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామగ్రికి నష్టం వాటిల్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజేందర్ తదితరులు ఉన్నారు.



## రుణాలు ఎప్పటికప్పుడు చెల్లించాలి..

**అక్షరటుడే, గాంధారి:** మహిళా సంఘాలు తాము తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మండలంలోని నేరల్‌తండాలో రుణాలు తీసుకున్న వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీనిధి కింద తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు కట్టినప్పుడే తిరిగి రుణ సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రాజయ్య, అధికారులు ప్రసన్నకుమార్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రత కోసం సీసీ కెమెరాల వినియోగం అభినందనీయం

**అక్షరటుడే, బాల్కొండ:** ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల వినియోగం అభినందనీయమని సీఐ జాన్ రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో 16 సీసీటీవీ కెమెరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. గ్రామంలో భద్రతను మెరుగుపర్చడం, నేరాలను నియంత్రించడం సీసీ కెమెరాలతో సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సీసీటీవీ కెమెరాలు నేర నియంత్రణ, నేరాల గుర్తింపు, శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సీసీటీవీ కెమెరాలు లేని గ్రామాల్లో కూడా వాటిని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై శైలేందర్, ఏఎస్సై, చిట్టాపూర్ వీపీవో, పోలీస్ కానిస్టేబుల్ శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.






# పని కావాలంటే తిరగాల్సిందే..

నగర పాలక సంస్థలో ఒక పని కావాలంటే.. పది సార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి అధికారులు ఉన్నారో.. లేరో కూడా తెలియని పరిస్థితి. దీంతో నగరవాసులు ఏ విభాగానికి ఏ పత్రాలు తీసుకొని వెళ్లాలో తెలియక నానా తంటాలు పడుతున్నారు.

**- అక్షరటుడే, ఇందూరు**

- **నగర పాలక సంస్థలో ఇబ్బందులు**
- **సమయపాలన పాటించని అధికారులు**
- **కొరవడిన పర్యవేక్షణ**

నగరపాలక సంస్థలో రెవెన్యూ పన్నుల చెల్లింపు, జనన మరణ ధ్రువీకరణాలు, ఇంటి అనుమతులు, వీధి దీపాలు, ఇంజనీరింగ్, శానిటేషన్, మెప్మా, ఇందిరమ్మ ఇల్లు, పరిపాలన తదితర విభాగాలు ఉన్నాయి. అయితే ఇందులో కొందరు ఉద్యోగులు అధికారులు సమయపాలన పాటించడం లేదు. శనివారం, సోమవారం వచ్చిందంటే చాలు కొన్ని విభాగాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలాగే సోమవారం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు ప్రజావాణిలోనే ఉండాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

### టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదులు

పట్టణ ప్రణాళికలో ఇంటి అనుమతుల జారీ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించలేకపోవడం, నోటీసుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. దీంతో ఈ విభాగం పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త నిర్మాణాలకు తొందరగా అనుమతులు ఇవ్వకపోవడం, రోజుల తరబడి తిప్పించుకోవడంతో విభాగంపై వ్యతిరేకత పెరుగుతోంది.

### నల్లా కనెక్షన్ కోసం..

కొత్తగా ఇల్లు నిర్మించుకున్న వారికి నల్ల కనెక్షన్ తీసుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఇంజినీరింగ్ అధికారుల చుట్టూ పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. దరఖాస్తులపై రోజుల తరబడి సంతకాలు చేయకపోవడంతో ఇంటి యజమానులు ముప్పు తిప్పలు పడుతున్నారు. మరి కొందరు ఉద్యోగులు క్షేత్రస్థాయి పని ఉందంటూ ఉదయాన్నే సంతకాలు చేసి వెళ్లడంతో కార్యాలయానికి వచ్చే వారికి దొరకడం లేదు.

### ఎమ్మెల్యే అసహనం

నగరపాలక సంస్థలోని ఉద్యోగుల పనితీరు, అవినీతిపై అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అసహనం వ్యక్తం చేశారు. పలుమార్లు నగరపాలక సంస్థ కమిషనర్‌తో పాటు కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా కొందరు అధికారుల తీరులో మార్పు రాలేదు. నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తున్నా... కొన్ని విభాగాలు గాడిలో పడటం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

## ప్రజావాణికి 103 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీపీవో శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం..: రాకేష్ రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రంజాన్ గిఫ్ట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచదేశాల్లో అన్ని మతాలవారు ఎక్కడ కూడా ప్రశాంతంగా లేరని.. కేవలం భారతదేశంలో మాత్రమే అన్నివర్గాల వారు భయంలేకుండా రక్షణ వ్యవస్థలో సంతోషంగా ఉన్నారన్నారు. 102 దేశాలతో భారతదేశానికి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. దేశం ముఖ్యమని కులాలు మతాలు కాదని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి కావాలి అంటే ఐక్యంగా ఉంటే మాత్రమే అభివృద్ధి సాధ్యమని.. గెలిచిన కౌన్సిలర్లు అందరికీ తన తరుపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆర్మూర్ అభివృద్ధి జరగాలంటే.. అన్ని పార్టీల వారు కలిసి వస్తేనే సాధ్యమవుతుందని రాకేష్ రెడ్డి అన్నారు. అనంతరం 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 15మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ లహరి, వైస్ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, యమాద్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మొక్కల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పల్లెప్రకృతి వనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కల పెరుగుదల, నిర్వహణ పనులను కలెక్టర్ సమీక్షించారు. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు బాగా పెరిగేలా ప్రతిరోజూ నీరు పోయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, శుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేయడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవి చెట్లుగా ఎదిగే వరకు నిరంతరంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను కాపాడాలని ఆయన కోరారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ ఆరా



తీశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, వార్డు మెంబర్లు, సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేర్‌టేకర్ అనుచిత ప్రవర్తన.. విధుల నుంచి తొలగింపు

**అక్షరటుడే, ఆర్మూర్/భీమ్‌గల్/బాల్కొండ:** బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని, మోడల్ స్కూళ్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సందర్శించారు. స్టోర్ రూమ్, కిచెన్ తదితర వాటిని తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ కేర్ టేకర్ విధులపై నిర్లక్ష్యం వహిస్తూ, తమతో అనుచితంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు, సిబ్బంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విద్యార్థినులతో ప్రత్యేకంగా భేటీ అయి, పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేర్ టేకర్ రెగ్యులర్‌గా విధులకు హాజరు కారని, తమ బాగోగుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని వారు తెలిపారు. హాస్టల్‌లో నీటికొరత తీవ్ర స్థాయిలో నెలకొని ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని వారు వాపోయారు. సదరు కేర్ టేకర్ తమను కూడా పరుష పదజాలాలతో దూషిస్తూ, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని మోడల్ స్కూల్ సిబ్బంది సైతం కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, మోడల్ స్కూల్ కేర్ టేకర్ తీరుపై తక్షణ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీఈసీవో భాగ్యలక్ష్మి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. వారి నివేదిక ఆధారంగా కేర్ టేకర్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే



సహించేది లేదని, విద్యార్థుల ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. మోడల్ స్కూల్‌లో నీటి కొరతను శాశ్వతంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులకు గణితంలో పలు ప్రశ్నలు వేసి, వారి అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేశారు. సరైన సమాధానాలు చెప్పిన బాలికలను అభినందిస్తూ, చాక్లెట్ బాక్సులు అందజేశారు. పరీక్షలు సమీపించినందున ఏకాగ్రతతో చక్కగా చదువుకోవాలని, అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

## ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమానికే ప్రాధాన్యత : షబ్బీర్‌అలీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆర్థిక ఇబ్బందుల్లోనూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి అందజేశారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ప్రధాన సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని స్పష్టం చేశారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలనలో అప్రతిహతంగా అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కీలకమైన హామీలన్నింటినీ నెరవేర్చిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలు చెప్పడం కాదు.. చేతుల్లో చూపిస్తుందని పీసీసీ చీఫ్ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. వీటికి తోడు ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాల కల్పన, సన్న బియ్యం పథకాలతో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులు ప్రారంభం



**అక్షరటుడే, భీమ్‌గల్:** గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వాడి–పచ్చలనడ్కుడ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి అన్నారు. ఈ మేరకు వేల్పూర్ మండలంలోని వాడి నుంచి పచ్చలనడ్కుడ వరకు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన రహదారి నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. వాడి సర్పంచ్ రమ్య ప్రశాంత్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారి వల్ల ప్రయాణికులు, గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి, యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిధుల కేటాయింపునకు సహకరించిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోలి లింబాద్రి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంకం రమేష్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బద్ద మహేందర్, జిల్లా బీసీ జనరల్ సెక్రెటరీ ఆర్.మహేందర్, పచ్చలనడుకుడ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్ పాల్గొన్నారు. ఇంకా కాంగ్రెస్ నాయకులు కాశిరెడ్డి అశోక్, బొడ్డు నడ్పి నర్సయ్య, కాశం సాయి కృష్ణ, రెడ్డిల్ల సతీష్, బొడ్డు శ్రీధర్, అంకం మహేష్, బొల్లి మధు, బొమ్మిన మోహన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళికను విజయవంతం చేద్దాం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో విజయవంతం చేద్దామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ భాగ్యమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ మీదుగా గాంధీ చౌక్ వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ వైస్ ఛైర్మన్ భాగ్యమ్మ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల్లో పర్యావరణ పరిశుభ్రతతో పాటు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు సిద్ది శ్రీధర్, తిరుపతి, రఫీక్, చంద్రయ్య, గఫార్, కమిషనర్ మహేష్ కుమార్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, సీఐ రాజిరెడ్డి, ఎంఈవో రాజులు పాల్గొన్నారు.




**వంటగ్యాస్ ధరలు మంట పుట్టిస్తున్నాయి. మధ్య ప్రాచ్యంలో యుద్ధం నేపథ్యంలో సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇటీవల గ్యాస్ ధరలు పెరిగాయి. దీంతో జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాలపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతుండగా.. గ్యాస్ సిలిండర్ రేటు పెరగడంతో కలవరపడుతున్నారు. జిల్లా ప్రజలందరిపై నెలకు దాదాపు రూ.కోటి వరకు అదనపు భారం పడనుంది.**

– అక్షరటుడే, భీమ్‌గల్

# మంట పుట్టిస్తున్న గ్యాస్ ధరలు..

■ అంతర్జాతీయ పరిణామాలతో పెరుగుదల ■ జిల్లాలో సామాన్యుడిపై రూ.కోటి భారం

నిజామాబాద్ జిల్లాలో గ్యాస్ వినియోగం గణనీయంగా ఉంది. జిల్లావ్యాప్తంగా 42 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల సరఫరా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో నెలకు సగటున 1.50 లక్షల సిలిండర్లు వినియోగమవుతున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

### పెరిగిన భారం

ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది. ఒక్కో సిలిండర్‌పై రూ. 60 పెరగడంతో జిల్లాలోని మొత్తం వినియోగదారులపై పడే భారం అక్షరాలా రూ.కోటికి చేరువలో ఉంది. ఒక సామాన్య కుటుంబం ఏడాదికి సగటున 8 నుంచి 10 సిలిండర్లు వాడుతుందని భావిస్తే, ఒక్కో కనెక్షన్‌పై ఏడాదికి రూ. 480 నుంచి రూ. 600 వరకు అదనపు భారం పడుతోంది. జిల్లాలోని మొత్తం కనెక్షన్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే, పెంచిన ధరల వల్ల ప్రభుత్వం జిల్లా ప్రజల నుండి భారీ మొత్తంలో అదనపు ఆదాయాన్ని వసూలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### గ్యాస్‌తో పాటు నిత్యావసరాలు..

గ్యాస్ సిలిండర్‌తో పాటు నిత్యావసరాలు సైతం పెరుగుతూ వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను నియంత్రించాలని లేదా సబ్సిడీ పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## నానో యూరియాపై రైతులకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 'ఆత్మ' సంస్థ ఆధ్వర్యంలో నానోయూరియా వాడకంపై మీసాన్‌పల్లి రైతు వేదిక వద్ద రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుధా మాధురి మాట్లాడుతూ రైతులు నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. నానో యూరియాను ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. అదే విధంగా రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆచరిత, ఏఈవోలు ముఖీద్, రాజాగౌడ్, రవీందర్, సతీష్, ఇఫ్కో కంపెనీ ప్రతినిధి విష్ణువర్ధన్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు బాబు, భూమయ్య, మైపాల్, రైతులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన మాజీ మేయర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో నిజామాబాద్ నగర తొలి మేయర్, జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ ఆయనను ఘనంగా సన్మానించారు.



## విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోకి కోనాపూర్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు ఉప సర్పంచ్ మోర్తాడ్ ఉదయ్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో కేసీతండా సర్పంచ్ లకావత్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు చిన్నోళ్ల రెడ్డి, మహోదయ స్కూల్ కరస్పాండెంట్ మోర్తాడ్ ఉమేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య, సౌత్‌కొరియా విశ్వ విద్యాలయం ఫిజిక్స్ ప్రొఫెసర్ శనిగరపు మల్లేష్, మోర్తాడ్ ఉదయ్, హెచ్‌ఎం రాంప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

## తాండూర్ పాఠశాలలో..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాండూర్ పాఠశాలలో విద్యార్థులకు కన్నారెడ్డి గ్రామానికి చెందిన పేరుపల్లి సాయి బాబా పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలో సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దనే ఉద్దేశంతో కిట్లను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించాలని పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జైలుశిక్ష

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లావ్యాప్తంగా పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. తాజాగా సోమవారం ఒక్కరోజే 86 మందికి కోర్టు శిక్షలు విధించింది. ఇందులో 8 మందికి ఒకరోజు జైలు, ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. మిగతా వారికి రూ.1,22,500 భారీ జరిమానా విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణం చాలా విలువైందని, ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత




**అక్షరటుడే,పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ విఠల్ పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కష్టపడి చదివితే ప్రతివ్యక్తి జీవితంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. డిజిటల్ కంటెంట్ ద్వారా విద్య మరింత సులభంగా సమగ్రంగా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మిట్టపల్లి ఉన్నత పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ



**అక్షరటుడే, ఇందూరు:** డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఇంక్విల్యాబ్ ఇన్నోవేషన్స్ ఫౌండేషన్ ప్రతినిధి క్రాంతికుమార్ 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో నరేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. అనంతరం ఎన్జీవో సంస్థ ప్రతినిధి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుశీల్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల అవసరాలను తెలిపిన వెంటనే డ్యుయల్ డెస్క్ బెంచీలను అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు సైతం డెస్కులు అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దాత క్రాంతి కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ సవిత నర్సయ్య, ఉప సర్పంచ్ బాలగంగాధర్, వీడీసీ కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యాయులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 114 గ్రామాలకు మహిళా సమాఖ్య భవనాల మంజూరు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 114 గ్రామాలకు మహిళా సమాఖ భవనాలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రకటించారు. సుమారు రూ .1.40 కోట్ల నిధులతో వీటిని నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 114 గ్రామాలకు మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఒక్కో మహిళా సమా ఖ్య భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున, మొత్తం 114 భవనాలకు రూ.11.40 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. మరికొన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్ స్వయంగా పాల్గొని భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ భవనాలు నిర్మాణం పూర్తయిన తర్వాత మహిళా సంఘాల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిం చుకోవడానికి శాశ్వత వేదికలు అందుబాటులోకి రానుంది.

## భీమ్‌గల్ పట్టణంలో విజయవంతంగా 5కే రన్



**అక్షరటుడే, భీమ్‌గల్:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 5కే రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి పరుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ పరుగును చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని అర్బన్ పార్క్‌ను సందర్శించిన ఛైర్‌పర్సన్, అక్కడ జరుగుతున్న కంపోస్ట్ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో వ్యర్థాలను ఎరువుగా మార్చడం అభినందనీయమన్నారు. దీనివల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపక శాఖ కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా అధికారి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర సమయాల్లో 101/112కి కాల్ చేయడం, సురక్షితంగా బయటపడే మార్గాలు, మాక్ డ్రిల్స్‌తో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు విద్యార్థులను సిద్ధం చేయడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మంటలు లేదా పొగను గమనించిన వెంటనే ఇతరులను అప్రమత్తం చేయాలని సూచించారు. అత్యవసరంగా అక్కడి నుంచి నిష్క్రమించాలని సూచించారు. విద్యార్థులు ఇళ్లలో కూడా అగ్ని ప్రమాదాల గురించి తల్లిదండ్రులకు చెప్పి, జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఫైర్ ఆఫీసర్ వినోద్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్మూర్ గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలను సురక్షితంగా ఎలా ఉపయోగించాలి.. సైబర్ బెదిరింపులు, చట్ట విరుద్ధమైన అప్లికేషన్స్, వివాహ వెబ్‌సైట్లలో మోసాలు, ఫొటో మార్ఫింగ్, బ్లాక్‌మెయిలింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుజాత, సూపరింటెండెంట్ ఈ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎం.శిరీష, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.